క్లుప్తంగా

కార్తిక మాస ఏర్పాట్లపై రేపు సమావేశం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో కార్తిక మాసం నెల రోజుల పాటు భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చే సమయంలో వారికి చేయాల్సిన ఏర్పాట్లపై శనివారం ఉదయం సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. కాకినాడ ఆర్డీఓ ఎస్.మల్లిబాబు అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, పట్టణ ప్రముఖులు, ట్రస్టు బోర్డు సభ్యులు, భక్త సంఘ నాయకులు పాల్గొన్ని సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ



పెద్దాపురంలోని ఆస్పత్రులు, క్యాంటీన్లను పరిశీలిస్తున్న జిల్లా భద్రత కమిటీ సభ్యులు

సామర్లకోట: ఆస్పత్రుల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ఆస్పత్రి నిర్వాహకులపై ఉంటుందని జిల్లా వినియోగదారుల భద్రత కమిటీ సభ్యులు కొమ్మోజు శ్రీనివాసరావు, బొమ్మాడి సూర్యనారాయణ మూర్తి, మండవిల్లి భాస్కరరావు, వేదుల శ్యామల అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం వారు పెద్దాపురంలోని వివిధ ప్రైవేటు ఆస్పత్రులను పరిశీలించారు. ఈ మేరకు రోగుల నుంచి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ మేరకు ఆస్పత్రిలో సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు.

మరిడమ్మను దర్శించుకున్న ఆర్ఎం



అమ్మవారిని దర్శించుకున్న రీజనల్ మేనేజరు

పెద్దాపురం(సామర్లకోట): ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు సీనియర్ రీజినల్ మేనేజరు రవికుమార్ గుప్తా గురువారం సాయంత్రం పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, పండితులు స్వాగతం పలికారు. ఆలయ పండితులు మరిడమ్మ అమ్మవారి విశిష్టతను వివరించారు. అమ్మవారిని దర్శించుకున్నా రీజనల్ మేనేజరుకు అమ్మవారి ప్రసాదం, ఫోటోను అందజేశారు.

రైతు సేవా కేంద్రానికి మరమ్మతులు



కొండెవరంలో రైతు సేవా కేంద్రం మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ లక్ష్మీరెడ్డి

కొత్తపల్లి: రైతులకు సొంత గ్రామంలోనే సేవలను అందించానే ఉద్దేశంతో గత ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. కొండెవరం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్మించిన రైతు సేవా కేంద్రం -1 ప్రారంభించకుండానే బీటలు వాడడంపై సాక్షి దినపత్రిలో మంగళవారం నిరుపయోగంగా రైతు సేవా కేంద్రం అనే శీర్షిక ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. దీనిపై స్పందించిన ఎంపీడీఓ లక్ష్మీరెడ్డి రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించారు. పూర్తిస్థాయిలో మరమ్మతు పనులు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

ఇంటర్ యూనివర్సిటీలో కిట్స్ విద్యార్థుల ప్రతిభ



కబడ్డీలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో చైర్మన్ తదితరులు

పెద్దాపురం(సామర్లకోట): ఇంటర్ యూనివర్సిటీ బాలుర విభాగంలో పెద్దాపురం మండలం దివిలి కిట్స్ విద్యార్థులు కబడ్డీలో ప్రతిభ కనబర్చారు. ఈ మేరకు కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు కబడ్డీలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఇటీవల జేఎస్‌టీయూకే కర్నాటక రాష్ట్రంలో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో అభినాష్, చక్రి, దశరథా, వంశీ విద్యార్థులు కబడ్డీలో మంచి ప్రతిభ కనబర్చడంతో వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గిరిధర్, డైరెక్టరు సుజన్, డీన్ ఆఫ్ అకాడమిక్స్ సర్వరమేశ్వరుడు, పీడీ స్వామి ఉన్నారు.

దీపావళికి సర్వం సిద్ధం

- నిబంధనలతో హోరెత్తిస్తున్న అధికారులు
- నియోజకవర్గంలో 53 తాత్కాలిక బాణసంచా షాపులు



పెద్దాపురంలో తాత్కాలిక బాణసంచా షాపుల ఏర్పాటు



సామర్లకోట టీటీడీసీ వద్ద బాణసంచా విక్రయానికి అనుమతి లభించిన ప్రదేశం

సామర్లకోట: దీపావళి వచ్చిందంటే పిల్లలు పెద్దలు ఎంతో ఆనందంగా గడుపుతారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా దీపావళిని జరుపు కొంటాము. పురాణాల్లో నరకాసురుని వధ జరిగిన సందర్భంగా దీపాలు వెలిగించడం, టపాసులు కాల్చుతూ సంబరాలు చేసుకుంటారు. ఇది దేశ వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన దీపావళి జరుపుకోవడానికి పిల్లలు, పెద్దలు మహిళలు సిద్ధంగా ఉన్నారు. బాణసంచా విక్రయాలు చేయడానికి నియోజకవర్గంలో 50 షాపులు ఏర్పాటుకు అధికారులు అనుమతి ఇచ్చారు. సామర్లకోట పట్టణంలో 14, వేట్లపాలెంలో 7, పీబీ దేవం ఒకటి, మేడపాడులో రెండు, ఉండూరు ఒకటి, షాపులలోను బాణసంచా విక్రయాలు చేయడానికి అధికారులు అనుమతులు ఇచ్చారు.అగ్ని మాపక, రెవెన్యూ, పోలీసు అధికారుల సంయుక్తంగా పర్యవేక్షణ చేసి తాత్కలిక అమ్మకాలకు లైసెన్సులు మంజూరు చేశారు. వీటితో పాటు మండలంలో నాలుగు బాణసంచా తయారీ షాపులు ఉండగా వాటిలో రెండు షాపులకు 365 రోజులు బాణసంచా విక్రయాలకు అనుమతి ఉంది. అదే విధంగా హుస్సేన్‌పు రంలో ఒక షాపుకు 365 రోజులు బాణసంచా విక్రయానికి అనుమతి ఉంది.

తాత్కాలిక షాపుల ఏర్పాటుకు సిద్ధం

పెద్దాపురం పట్టణ పరిధిలో సామర్లకోట–కాకినాడ రోడ్డులో సుధా ఫ్యాక్టరీ సమీపంలో ప్రైవేటు స్థలంలో 25 షాపులు ఏర్పాటుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మండల పరిధిలో చంద్రమాంపల్లిలో ఒకటి, సిరివాడలో ఒకటి, రామేశంపేటలో ఒకటి తాత్కలిక షాపులు ఏర్పాటు చేస్తున్నారు. షాపులకు కేవలం రేకులతో మాత్రమే నిర్మాణం చేయాలనే నిబంధన ఉంది. అదే విధంగా షాపుకు షాపుకు మధ్య మూడు మీటర్లు దూరం ఉండేలా షాపుల నిర్మాణం చేస్తున్నారు. పెద్దాపురం మండల పరిధిలో నాలుగు బాణసంచా తయారీ షాపులు ఉండగా పెద్దాపురం పట్టణ పరిధిలోని రెండు షాపులను నిలివివేయించగా జి.రాగంపేట పరిధిలో రెండు షాపుల్లో బాణసంచా తయారీకి అనుమతి ఇచ్చారు. సామర్లకోట పట్టణ పరిధిలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో గత 13 ఏళ్లగా తాత్కాలిక షాపులు ఏర్పాటు చేసుకొని అమ్మకాలు సాగించేవారు. అయితే ప్రస్తుతం అనుమతి ఇవ్వకపోవడంతో త్రిసభ్య కమిటీ సిపార్సులతో పెద్దాపురం–పిఠాపురం రోడ్డులోని టీటీడీసీ–విస్తరణ శిక్షణ కేంద్రాల మధ్య రోడ్డులో షాపులు ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. దాంతో షాపుల నిర్వాహకులు గురువారం ఆ ప్రదేశంలో తుప్పలను తొలగించుకుని, షాపుల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

త్రిసభ్య కమిటీ అనుమతితో..



పోలీసు, రెవెన్యూ అగ్నిమాపక అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీ సూచనలతో పెద్దాపురం–పిఠాపురం రోడ్డులోని బడేలమ్మ చెరువు సమీపంలో తాత్కాలికంగా 14 షాపులు ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. పోలీసుల సహకారంతో మూడు రోజుల పాటు ట్రాఫిక్ మళ్లింపు జరుగుతుంది. పెద్దాపురం నుంచి పిఠాపురం, ప్రత్తిపాడు వెళ్లే భారీ వాహనాలను ఇండస్ట్రియల్ ఎస్టేట్ మీదుగా మళ్లింపునకు అనుమతి తీసుకున్నారు. తాత్కాలిక షాపులు రేకులతో షేడ్లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇప్పటికే నిబంధనలు జారీ చేశాం. వాటి ప్రకారం విక్రయాలు జరగాలన్నారు.

– కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్, సామర్లకోట

నిబంధనలు తప్పనిసరి



అందరూ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. పెద్దాపురం నియోజకవర్గంలో 56 షాపులలో బాణసంచా విక్రయాలు జరుగుతాయి. పెద్దాపురం మున్సిపాలిటీలో 25, మండల పరిధిలో మూడు, సామర్లకోట మున్సిపాలిటీలో 14, రూరల్ పరిధిలో11 తాత్కలిక షాపులలోను, మూడు పర్మినెంట్ షాపులలోను బాణసంచా విక్రయాలకు అనుమతి ఇచ్చాం. ప్రతి షాపుల వద్ద నీటి డ్రమ్ములతో పాటు ఇసుక బకెట్లు ఏర్పాటు చేసుకోవాలి. షాపులలో పని చేసే ప్రతి ఒక్కరికి బీమా ఉండాలి. షాపుల వద్ద భద్రత బాధ్యత షాపుల యజమానులే చూసుకోవాలి.

– ఎం.శ్రీహరిజగన్నాథ్, జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి, పెద్దాపురం

పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి



పౌష్టికాహారం స్టాల్‌ను పరిశీలిస్తున్న దుర్గారాణి తదితరులు

పిఠాపురం: తల్లిదండ్రులు బాలలపై ప్రత్యేక శ్రద్ధ కనపరచడం ద్వారా వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి అన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ దుర్గాదేవి ఆధ్వర్యంలో పిఠాపురంలో కొత్తపేట అంగన్‌వాడీ సెంటర్, వరలక్ష్మి హాస్పిటల్‌లో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్తంగా గురువారం నిర్వహించిన బాలికల దినోత్సవ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దుర్గారాణి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులు ఆడపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పోషణ్ మహ్ కార్యక్రమాలు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16వ తేదీ వరకు పలు అంశాలపై గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు హాస్పిటల్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు



గ్రామంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై, తహసీల్దార్లు

పెద్దాపురం(సామర్లకోట): బాణసంచా విక్రయందారులు ప్రభుత్వం విధించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అగ్నిమాపక అధికారి ఎం.శ్రీహరిరాజు, తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి, ఎస్సై మౌనిక అన్నారు. గురువారం పెద్దాపురం పట్టణ, మండల పరిధిలోని బాణసంచా విక్రయదారులతో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ప్రతి బాణసంచా షాపు వద్ద డ్రమ్ము వాటర్, ఇసుక, అగ్నిమాపక పరికరాలు ఉండాలని సూచించారు. బాణసంచా షాపుల్లో పని చేసే ప్రతి ఒక్కరికి బీమా తప్పనిసరిగా ఉండాలన్నారు. షాపుల వద్ద వారి లైసెన్సును ఉంచాలని సూచించారు. బాణసంచా విక్రయాల షాపుల పరిసరాల వద్ద అనుమతులు లేకుండా విక్రయాలు చేసే వారిపై కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పెద్దాపురం నియోజకవర్గంలో ఉన్న అన్ని షాపులను పూర్తిగా పరిశీలించామని అప్పట్లో సూచించిన విధంగా ఉండాలన్నారు. సూచించిన స్థలాల్లో మాత్రమే విక్రయాలు చేయాలన్నారు. ప్రతి షాపు రేక్ షేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పెద్దాపురంలో బాణసంచా తయారు చేసే రెండు షాపులను మూసి వేశామన్నారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉదయం 8 గంటల నుంచి రాత్రి ఏడు గంటల వరకు మాత్రమే బాణసంచా విక్రయాలు చేయాలన్నారు. 18, 19, 20 తేదీల్లో మాత్రమే విక్రయాలు చేయాని సూచించారు. ప్రతి షాపులోను 500 కేజీలకు మించకుండా విక్రయాలు చేయాలన్నారు. ప్రతీ షాపు యజమాని కేర్ టేకర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. టెంట్లు ఏర్పాటు చేసుకొని విక్రయాలు చేస్తే చర్యలు తీసుకొంటామన్నారు.

దివిలిలో బాణసంచా షాపుల స్థలం పరిశీలన

పెద్దాపురం మండలం దివిలిలో బాణసంచా విక్రయానికి సంబంధించి స్థలాన్ని అధికారులు పరిశీలించారు. పెద్దాపురం ఆర్డీఓ సీహెచ్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించిన షాపుల నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మౌనిక ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

కొత్తపల్లి: దీపావళికి విక్రయించే బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పని సరిగా ఉండాలని డిప్యూటీ తహసీల్దారు మురళీకృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయనున్న స్థలాలను గురువారం ఎస్సై వెంకటేష్‌తో కలిసి ఆయన పరిశీలించారు. తహసీల్దారు మాట్లాడుతూ దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు అగ్నిమాపక, పోలీసులు శాఖలకు సంబంధించిన అనుమలుతు తప్పని సరిగా పొందాలన్నారు. అనుమతులు లేకుండా షాపులను ఏర్పాటు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మందుగుండు సామగ్రిని అక్రమంగా నిల్వ ఉంచినా చర్యలు తప్పవన్నారు. ఏ ప్రమాదం సంభవించినా దానికి పూర్తి బాధ్యత నిర్వాహకులే వహించాలన్నారు. ఇప్పటి వరకూ 8 దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతుల కోసం దరఖాస్తులు అందాయని వీటిని గ్రామ రెవెన్యూ అధికారి పోలీసులతో దుకాణాల ఏర్పాటు పరిశీలన చేసిన తరువాతే ఉన్నతాధికారులకు అనుమతుల ప్రకారం మంజూరు చేస్తామన్నారు. కొండెవరం–1, కొత్తపల్లి–2, మూలపేట–3, వాకతిప్ప–2 దరఖాస్తులు వచ్చాయన్నారు. షాపులను రేకులతోనే ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వీఆర్వోలు గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నారు.



వాకతిప్పలో దుకాణాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పంచారామ క్షేత్రంలో రైల్వే పీఆర్‌సీ ఎండీ పూజలు



పంచారామ క్షేత్రంలో రైల్వే అధికారి కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందజేస్తున్న వేదపండితులు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామ భీమేశ్వర స్వామి ఆలయంలో సౌత్ సెంట్రల్ రైల్వే(సికింద్రాబాద్) పీఆర్‌సీ ఎండీ డాక్టరు నిర్మల రాజారామ్ కుటుంబ సభ్యులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన వారికి ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవస్వామి, ఉప ఆలయాలను దర్శించుకొని, స్వామి వారికి అమ్మవారికి పూజలు చేశారు. పూజలు అనంతరం ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అళ్లకి రాజ్ గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, అంజిబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తిలు ఆశీర్వచనాలు అందజేశారు. ఈఓ నీలకంఠం వారికి ప్రసాదం, స్వామివారి ఫొటో అందజేశారు.

డ్రైనులో పూడిక తీత



జయలక్ష్మీ థియేటర్ రోడ్డులో జరుగుతున్న పూడిక తీత పనులు

సామర్లకోట: స్థానిక జయలక్ష్మీ థియేటర్ రోడ్డులోని ప్రధాన డ్రైనులో పూడిక తీత పనులను గురువారం ప్రారంభించారు. కొద్దిపాటి వర్షానికే ఈ రోడ్డులో నీరు నిలిచిపోయి చెరువుగా మారిపోతున్న విషయం విదితమే. ఈ రోడ్డులో ఇరువైపులా ఉన్న డ్రైన్లను ఆక్రమణ చేసి శ్లాబ్ వేయడంతో పూడిక తీయడానికి అవకాశం లేకపోవడంతో అది పేరుకుపోయి రోడ్డుపై నీరు నిలిచిపోతోంది. ఈ విషయాన్ని సాక్షి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమవడంతో అధికారులు స్పందించారు. డ్రైనుపై ఉన్న శ్లాబ్ రాళ్లను తొలగించి పూడిక తీత పనులు నిర్వహించారు. జేసీబీతో పూడిక తీయడానికి అవకాశం లేని ప్రదేశంలో మనుష్యులతో పూడిక తీయించారు. అదేవిధంగా జయలక్ష్మీ థియేటర్ నుంచి ప్రెసిడెంట్ గారి వీధిలోను పూడిక తీత పనులు చేపట్టారు. ఈ పనులను 23వ వార్డు కౌన్సిలర్ సేపెని సురేష్ పరిశీలించారు.

సీపీఆర్‌పై అవగాహన



గురజనాపల్లి హైస్కూల్‌లో సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న ఆయుర్వేద డాక్టర్ దివ్య

కరప: గుండెకు సంబంధించిన సమస్యలు ఎదురైనప్పుడు, ప్రాణాలు కాపాడేందుకు అత్యవసరంగా అందించే సీపీఆర్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయుర్వేద డాక్టర్ బి.దివ్య అన్నారు. ఒక ప్రాణం కాపాడడం అంటే ఒక కుటుంబాన్ని నిలబెట్టడమన్నారు. గురజనాపల్లిలోని పబ్బిసెట్టి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో సీపీఆర్ గురించి వివరించి, అవగాహన కల్పించారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ మంత్రిత్వశాఖ ఆదేశాలతో ఈ నెల 17వ తేదీ వరకు సీపీఆర్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. సడన్‌గా గుండె కొట్టుకోవడం ఆగిపోయినా, విద్యుదాఘాతంతో పడిపోయిన వ్యక్తులకు సీపీఆర్ చేయడం ద్వారా తిరిగి గుండె పనిచేయించి, బతికించే అవకాశముందన్నారు. ఏడు స్టెప్స్ ద్వారా సీపీఆర్ నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సీపీఆర్ ఎలా చేయాలో శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా జిల్లా స్థాయిలో స్వచ్ఛ ఆయుర్వేద హాస్పిటల్ అవార్డు పొందిన ఆయుర్వేద డాక్టర్ దివ్యను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం ఎ.సాయిమోహన్, యోగా టీచర్ ఎ.బాబ్జీ, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, పీడీ కె.నాగలింగేశ్వరరావు, టి.వేణుగోపాల్, ఎ.సూర్యనారాయణ, ఎం.ప్రభారాణి, పి.మాణిక్యాంబ, శోభాకర్, ఎన్‌యు రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: అచ్చంపేట గ్రామంలో నూతనంగా నిర్మాణం అయిన విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కొత్త లైన్ పనులు చేస్తున్న కారణంగా ఆయా గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఎవీఎన్‌డీఎస్ ప్రభాకర్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. పనసపాడు, అచ్చంపేట, కొప్పవరం గ్రామాలలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ప్రభుత్వ స్థలం పరిశీలన



పనసపాడులో సర్వే చేస్తున్న సీతారాం తదితరులు

సామర్లకోట: పనసపాడు గ్రామంలో బండి బాట ప్రభుత్వ స్థలాన్ని మండల సర్వేయర్ సీతారాం గురువారం పరిశీలించారు. పనసపాడు గ్రామానికి చెందిన శెట్టిబలిజ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రాయుడు మోజెస్‌బాబు సుమారు ఏడాది కాలంగా పట్టు వదలని విక్రమార్కుడిగా ప్రతి సోమవారం బండి బాట స్థలం ఆక్రమణపై సర్వే చేయాలని ఫిర్యాదు చేశారు. అదే విధంగా గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, క్రిస్టియన్‌లకు శ్మశాన వాటికలు లేవని వరుసగా ఫిర్యాదులు చేయడంతో జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఆ సమస్యలను పరిశీలించారు. పరిశీలనలో గుర్తించిన విషయాలను ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని మండల సర్వేయర్ సీతారాం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయుడు మోజెస్‌బాబు పాల్గొన్ని సమస్యను వివరించి, ఏడాది తరువాత మండల సర్వేయర్ రావడం జరిగిందన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



కొంగోడు పొలంబడిలో రైతులకు సూచనలిస్తున్న సైంటిస్ట్ డాక్టర్ సీతారామశర్మ

కరప: సార్వా పంట చివరి దశలో ఉందని రైతులు అప్రమత్తంగా ఉంటూ, ప్రతి రోజూ పంటను పరిశీలిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దాపురం ఏరువాక కేంద్రం సైంటిస్ట్ డాక్టర్ ఎ.సీతారామశర్మ పేర్కొన్నారు. కొంగోడులో గురువారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో రైతులతో సమావేశమై వివిధ పంటల తెగుళ్ల గురించి వివరించి, వాటి నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. వరి చేలు పొట్ట, ఈనిక దశలో దోమ ఆశించే అవకాశముందన్నారు. దోమలు దుబ్బుల నుంచి రసాన్ని పీల్చడం వల్ల పైరు లేత పసుపు వర్ణంలోకి మారుతుందన్నారు. వీటి ఉధృతి ఎక్కువగా ఉంటే పైరు సుడు, సుడులుగా వలయాకారంలో ఎండిపోతుందన్నారు. వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జీవన ఎరువుల గురించి వివరించారు. అనంతరం రైతులను పొలాల్లోకి తీసుకెళ్లి వరి దుబ్బులపై దోమలు ఉన్నదీ, లేనిదీ పరిశీలించారు.

ఏపీఎస్పీ హైస్కూల్ పరిశీలన



విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఎస్పీ బెటాలియన్‌క్యాంపు ప్రాంగణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టరు కృష్ణారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల పాఠ్య పుస్తకాలు, విలువల విద్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను ఆయన పరిశీలించారు. ఉపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలలో అంశాలను వివిధ స్థాయిల విద్యార్థులకు బోధించే పద్ధతి, మూల్యాంకనం గురించి సూచనలు ఇచ్చారు. పాఠశాలలో అమలవుతున్న కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గాయత్రి, ఎస్‌సీఈఆర్‌టీ టెక్స్ట్ బుక్ రైటర్ రమేష్, కాకినాడ డీవైఈఓ కేవీవీ సత్యనారాయణ, డీసీఈబీ సెక్రటరీ వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ ఆర్ఎం వంశీకృష్ణ

బాలాజీచెరువు: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్ఆర్)లో భాగంగా ఎస్‌బీఐ జిల్లాలో వివిధ పాఠశాలలో చదువుతున్న 18 బాలికలకు గురువారం సైకిళ్లు ఉచితంగా పంపిణీ చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ వంశీకృష్ణ హాజరై మాట్లాడుతూ, విద్య ప్రతి వ్యక్తి జీవితాన్ని, సమాజాన్ని మార్చుతుందన్నారు. బాలికలు విద్యను అభ్యసించడం ద్వారా కుటుంబంతో పాటు దేశానికి ప్రకాశవంతమైన భవిష్యత్ నిర్మించగలమన్నారు. బాలికల విద్యలో పెట్టుబడి పెట్టడం అంటే సమాజంలో రేపటి సమాజంలో పెట్టుబడి పెట్టడం లాంటిదన్నారు. ఎస్‌బీఐ ప్లాటీనం జూబ్లీ స్కాలర్‌షిప్ ద్వారా 9నుండి 12వ తరగతి అభ్యసిస్తూ 75శాతం పైగా మార్కులు సాధించినవారికి ఆర్థిక సహాయం చేస్తున్నారని,ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు.విద్యాభివృద్ధి దిశగా ఎస్‌బీఐ తరపున సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

మానసిక వికలాంగులకు పోషకాహారం వితరణ

కాకినాడ క్రైం: పెదపూడి మండలం చింతపల్లి లాకు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కొమ్ము జోసఫ్ 35వ వర్ధంతి సందర్భంగా ఆయన కుమార్తె ఆర్ఎంసీ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్, విశ్రాంత అసిస్టెంట్ ప్రొఫెసర్ కొమ్ము మేరీ సుగుణ మణి గురువారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆమె తన సోదరులు జాన్ క్రిస్టోఫర్, రాజ్‌కుమార్, సోదరి మేరీ సుగంధ మణితో పలు కార్యక్రమాలు పూర్తి చేశారు. అందులో భాగంగా సామర్లకోట, పెద్దాపురం రోడ్డులో ఉన్న సిరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్లీ హ్యాండీక్యాప్డ్ మానసిక వికలాంగుల వసతి గృహాన్ని సందర్శించారు.

40 మంది మానసిక దివ్యాంగులకు దుప్పట్లు, పోషకాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకురాలు గోపి దేవితో మాట్లాడి రోజు వారీ నిర్వహణతోపాటు వారిని సంరక్షిస్తున్న తీరును అడిగి తెలుసు కున్నారు. మానసిక దివ్యాంగుల సంరక్షణ కోసం తన వంతు సహాయసహకారాలు అందిస్తానని అన్నారు.